# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 306
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
సెప్టెంబర్ 17, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## రేషన్‌కు 'రేటు'

- కార్డుకు రూ.2000 డిమాండ్
- కలకలం రేపుతున్న డీలర్ వ్యవహారం





## వారిది ప్రజాకంటక పాలన

- 420 హామీలు, 6 గ్యారెంటీల అమలు ఎప్పుడు
- ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

8లో..



## సిగ్గులేని బీఆర్ఎస్ నేతలు

మీరు విలీనం చేసుకున్న ఎమ్మెల్యేలపై ఎందుకు మాట్లాడరు

కాళేశ్వరం అవినీతిపై మాట్లాడనివారు కడియం గురించి మాట్లాడుతున్నారు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



## సూపర్ పవర్ దేశంగా భారత్

- లక్ష్యంతో అడుగులు వేస్తున్న మోడీ
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

భారతదేశాన్ని సూపర్ పవర్ గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోడీ అహర్నిశలు శ్రమిస్తున్నారని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ దేశంలోని ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందడమే లక్ష్యంగా కేంద్రం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతు సంక్షేమమే ధ్యేయంగా మోడీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే అమెరికా ఎంత ఒత్తిడి చేసినా రైతుకు నష్టం కలిగించే పరికరాలను దిగుమతి చేసుకునేందుకు నిరాకరిస్తున్నారని వెల్లడించారు. దీంతో కక్ష కట్టిన అమెరికా ఇండియాపై ఎన్ని సుంఖాలు విధించినా భయపడకుండా రైతు క్షేమం కోసం పాటుపడుతున్నారని వివరించారు. – వరంగల్ వాయిస్, వరంగల్



# ఎవరి దారి వారిదే..!



వివరాలు2లో..

- బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం
- ప్రజాపాలన దినోత్సవం నిర్వహించిన కాంగ్రెస్
- జాతీయ సమైక్యతా దినోత్సవంగా బీఆర్ఎస్
- విమోచన కాదు విలీనం అన్న వామపక్షాలు
- విద్రోహ దినంగా పాటించిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా

నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి కలిగిన సెప్టెంబర్ 17ను దేశమంతా తెలంగాణ విమోచన దినోత్సవంగా పాటిస్తోంది. అయితే తెలంగాణలో మాత్రం ఎవరి దారి వారిదే అన్నట్లుగా దీనికి ఒక్కో పార్టీ ఒక్కో పేరు పెట్టి కార్యక్రమాలను నిర్వహించారు. ఆపరేషన్ పోలో పేరిట సర్దార్ వల్లభాయి పటేల్ ఆధ్వర్యంలో భారత సైన్యం హైదరాబాద్ సంస్థానాన్ని ముట్టడించి స్వాధీనం చేసుకున్నందున బీజేపీ విమోచన దినోత్సవంగా నిర్వహిస్తుంటే అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రజాపాలన దినోత్సవంగా ప్రకటించి కార్యక్రమాలను నిర్వహించింది. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ మాత్రం జాతీయ సమైక్యతా దినోత్సవంగా పేర్కొంటూ నాటి సాయుధ రైతాంగ, తెలంగాణ తొలి, మలిదశ అమర వీరులందరకీ నివాళులు అర్పించారు. అయితే వామపక్ష ఉద్యమాలకు నాటి నిజాం నవాబు తలొగ్గి భారత దేశంలో హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేశారని పేర్కొంటూ కార్యక్రమాలను చేపట్టగా సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాత్రం ఇది ముమ్మాటికీ విద్రోహ దినమేనంటూ ఆరోపించింది. అందుకు అనుగుణంగా నిరసన సభను నిర్వహించింది. అయితే ఎవరు ఏ పేరుతో పిలిచినప్పటికీ నిజాం రాజుల నుంచి హైదరాబాద్ సంస్థాన ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చిన సెప్టెంబర్ 17ను రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలను ఎగురవేశారు. - వరంగల్ వాయిస్ ప్రతినిధి

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, సెప్టెంబర్ 17, 2025

# ఎవరి దారి వారిదే..!



- బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం
- ప్రజాపాలన దినోత్సవం నిర్వహించిన కాంగ్రెస్
- జాతీయ సమైక్యతా దినోత్సవంగా బీఆర్ఎస్
- విమోచన కాదు విలీనం అన్న వామపక్షాలు
- విద్రోహ దినంగా పాటించిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను హనుమకొండ జిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అదాలత్ కూడలిలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తదితరులు పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజాపాలన వేడుకలకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ప్రజా పాలన, జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు గురించి ప్రసంగించారు. కాగా అంతకుముందు కలెక్టరేట్ కు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి పుష్ప గుచ్ఛం అందించగా కలెక్టరేట్ వద్ద పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండీ.అజీజ్ ఖాన్, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఎన్ఐటీ వద్ద ఘన స్వాగతం..

వరంగల్ ఎన్ఐటీకి చేరుకున్న రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పుష్ప గుచ్చాలు, మొక్కలు అందించి ఘన స్వాగతం పలికారు.

### వరంగల్ లో..

నర్సంపేట రోడ్డులోని ఓ సిటీ ఎదురుగా ఉన్న ఐడీఓసీ మైదానంలో బుధవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన మంత్రి పుర ప్రముఖులకు, అధికార అనధికారులకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రగతిని, సెప్టెంబర్ 17 ప్రాముఖ్యతను ఆమె వివరించారు. ఆంతకుముందు విశ్వకర్మ జయంతి సందర్భంగా ఐడీఓసీలో మంత్రి కొండా సురేఖ విశ్వకర్మ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ వేడుకల్లో నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎఫ్ఓ అనుజ్ అగర్వాల్, ఏసీపీ శుభం, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఆర్డీఓ, పుర ప్రముఖులు, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ కార్యాలయంలో..

కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు ప్రజాకంఠక పాలన అని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత భరత మాత చిత్రపటానికి కుడా మాజీ ఛైర్మన్ మర్రి యాదవ రెడ్డి పూలమాల వేయగా, తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ లీగల్ సెల్ రాష్ట్ర సభ్యులు, సీనియర్ న్యాయవాది తాళ్లపెల్లి జనార్ధన్ గౌడ్ పూలమాల వేశారు. అనంతరం దాస్యం వినయ్ భాస్కర్ జాతీయ జెండాను ఎగురవేశారు. వామపక్ష పార్టీలు మాత్రం విమోచనం కాదు విలీనం అంటూ సభలు ఏర్పాటు చేయడంతోపాటు జాతీయ జెండాను ఎగురవేశారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు మాత్రం విద్రోహ దినంగా పాటిస్తూ సభను నిర్వహించారు.







### పోలీస్ కమిషనరేట్ లో..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ కమిషనరేట్ పరిపాలన భవనం ప్రాంగణంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్ రావు, సురేష్ కుమార్ తో పాటు, ఏసీపీలు, ఆర్ఐలు, ఇన్ స్పెక్టర్లు, ఎస్సైలు, ఇతర పోలీస్ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో..



హనుమకొండలోని నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ కార్పొరేట్ కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాము. విజిలెన్స్ విభాగం నేతృత్వంలో నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ లో సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ జెండాను ఎగరవేసి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు కొల్పోయిన విద్యుత్ ఉద్యోగ అమరుల స్థూపం వద్ద పూలు జల్లి నివాళులు అర్పించారు. ఉద్యోగులందరికీ ప్రజా పాలనా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, సీవీఓ బోనాల కిషన్, సీఈలు టి.సదర్ లాల్, రాజు చౌహన్, అశోక్, కె.మాధవ రావు, సీజీఎంలు రవీంధ్రనాథ్, ఆర్.చరణ్ దాస్, జీఎంలు వెంకట కృష్ణ, మల్లికార్జున్, నాగప్రసాద్, వేణుబాబు, అన్నపూర్ణ, శ్రీకాంత్, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, ఇంజనీర్స్, అకౌంట్స్, పీ&జీ ఉద్యోగులు, ఆర్టిజన్స్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



### సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో నిరసన సభ..

మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ద్వారా మూడు వేల గ్రామాలలో ప్రజలు స్వయం పరిపాలన సాగించుకుంటూ, దొరలు, భూస్వాములు, పటేల్, పట్వారిలకు సంబంధించిన పది లక్షల ఎకరాల భూములు స్వాధీనం చేసుకొని సాగు చేసుకుంటుంటే యూనియన్ సైన్యం వచ్చి పలువురు కమ్యూనిస్టులు, ప్రజా పోరాట యోధులను హత్య చేసి, వేలాది మందిని చిత్రహింసలకు గురిచేసిన సెప్టెంబర్ 17, 1948 తెలంగాణకు విమోచనం ఎలా అవుతుందని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి ప్రశ్నించారు. ఇది ముమ్మాటికి విద్రోహ దినమే అన్నారు. బుధవారం వరంగల్ జిల్లా కేంద్రంలోని శివనగర్ లో సెప్టెంబర్ 17ను విద్రోహ దినంగా పాటిస్తూ సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ నాయకులు మైదం పాణి అధ్యక్షతన నిరసన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ వరంగల్ జిల్లా నాయకులు చిర్ర సూరి, పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, డివిజన్ నాయకులు సాబిరీకానీ మోహన్, సాగర్, కట్కూరి చిన్న వెంకటస్వామి, పెద్ద వెంకటస్వామి, ఉసిల్ల రాజన్న, చంటి, గాడి పెల్లి ప్రవీణ్, లక్ష్మి, ఎల్లయ్య, ఉపేందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యులే సాయిధులై..

**వరంగల్ వాయిస్, రాంనగర్ :** హనుమకొండ రాంనగర్ లోని బీసీ భవన్ లో కుడా మాజీ ఛైర్మన్, ఓబీసీ ఛైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమరుల చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనను తరిమికొట్టేందుకు కులమత బేధాలు పక్కనబెట్టి కమ్యూనిస్టులు, గాంధేయవాదులు, ఆర్య సమాజ్ కార్యకర్తలు సమైక్యతతో సాయుధ పోరాటం సాగించారన్నారు. ఈ పోరాటంలో సామాన్యులే సాయుధులై రజాకారులను తరిమికొట్టారన్నారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాట యోధులు చేసిన త్యాగాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని మరో మహోజ్వల పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రానున్న సామాజిక తెలంగాణ వైపు పడుతున్న ప్రస్తుత అడుగుల్లో సకల జనులతో కలిసి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని అందులో



బహుజనులు ముందుండాలని సుందర్ రాజ్ యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, ఓబీసీ నాయకులు రాజగోపాల్, వేణుమాధవ్, రాము, సకలజన కులాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తి

◆ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల గడ్డ చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాంతమని, అమరుల త్యాగాలను భావితరాలకు స్ఫూర్తిగా నిలిచే విధంగా కొనసాగించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాం రాచరిక పాలన నుంచి తెలంగాణకు స్వేచ్ఛను ప్రసాదించిన సెప్టెంబర్ 17 శుభదినం అని అన్నారు. అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ, హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో నిజాంపై సైనిక చర్య జరిపి, తెలంగాణను భారత యూనియన్‌లో విలీనం చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ఈ స్వాతంత్రాన్ని సాధించిందని చెప్పారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ నిరంకుశ పాలనను అంతం చేసి, ప్రజా పాలనను తీసుకువచ్చినందుకే ఈ రోజును ప్రజా పాలన దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. రైతులు, మహిళలు, యువకుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ప్రజా పాలనలో పేదలకు సన్నబియ్యం, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పౌరుల పాలనకు పునాది వేసిన చారిత్రక రోజు నేడు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో బుధవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ క్యాంపు కార్యాలయం, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, సెప్టెంబర్ 17, 1948 తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయి అని అన్నారు. ఆ రోజు నిజాం పాలన నుంచి విముక్తి పొంది ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాస్వామ్య పరిపాలనకు మార్గం ఏర్పడిందని చెప్పారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజలు చేసిన త్యాగాలను యువత మరిచిపోకూడదని, ఈ చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కమలాపూర్ మార్కెట్ యార్డులో..



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య గౌడ్, డైరెక్టర్లు ఆకినపల్లి భిక్షపతి, చక్కిలం దయాకర్, నిగ్గుల లింగయ్య, కిన్నర కృష్ణమూర్తి, మార్కెట్ కార్యదర్శి జన్ను యాకయ్యతో పాటు ఇతర మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

## నడికూడలో..



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో గజ్జెల విమల తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రజాప్రతినిధులు మల్లాల్ రావు, కుమారస్వామి, ఈర్ల చిన్ని, ఏఈ ఉదయ్ కుమార్, ఏపీవో విద్యావతి, ఈసీ రజినీకాంత్, సీనియర్ అసిస్టెంట్ సరోజన, టీఏలు స్వప్న, కుసుమ, రాధిక, కంప్యూటర్ ఆపరేటర్లు ఆసిఫ్, సాగర్, ప్రకాష్, కార్యాలయ సిబ్బంది గోవిందు, నవీన్ కుమార్, దొంతుల రాజేందర్, అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17 'తెలంగాణ విద్రోహ దినం'

### డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్




**వరంగల్ వాయిస్, కేయూ :** సెప్టెంబర్ 17ను 'తెలంగాణ విద్రోహ దినం'గా పాటించాలని డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్‌ఏ) డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించి, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అమరులైన వీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ మాట్లాడుతూ అప్పటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 'ఆపరేషన్ పోలో' పేరుతో సైనిక చర్య నిర్వహించి, 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రాంతాన్ని 'విలీనం' పేరుతో ఆక్రమించిందని శివ ఆరోపించారు. ఈ సైనిక చర్య తర్వాత వేలాది మంది కమ్యూనిస్టు నాయకులను, సానుభూతిపరులను జైల్లో నిర్బంధించి, చిత్రహింసలకు గురిచేసి చంపేశారని ఆరోపించారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతూ, కమ్యూనిస్టులు బలపడకుండా నిరోధించారని అన్నారు. తెలంగాణ చైతన్యవంతమైన గడ్డ అని, ఇక్కడ కమ్యూనిస్టులు బలపడితే ఆ ప్రభావం దేశవ్యాప్తంగా ఉంటుందని భయపడి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పోరాటాన్ని అణిచివేసిందని పేర్కొన్నారు. కాబట్టి, సెప్టెంబర్ 17 తెలంగాణకు విలీనమో, విమోచనమో కాదని, ముమ్మాటికీ ఇది విద్రోహమే అని ఉప్పుల శివ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఏ జిల్లా కో–కన్వీనర్ కేదారి ఉపేందర్, శశిధర్, శివ తదితరులు పాల్గొన్నారు.

## డిస్నీల్యాండ్ హైస్కూల్‌లో ..



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని డిస్నీల్యాండ్ హైస్కూల్‌లో బుధవారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పాఠశాల ఫౌండర్స్ డి. మల్లయ్య, డి. సదయ్య, బి.లక్ష్మి నివాసంలు తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పాటలు, ప్రసంగాలు, నృత్యాల ద్వారా తెలంగాణ విమోచన సమరయోధుల పోరాట స్ఫూర్తిని ప్రదర్శించారు. పాఠశాల డైరెక్టర్స్ శోభారాణి, రాకేష్ భాను, దినేష్ చందర్ మాట్లాడుతూ.. 1948 సెప్టెంబర్ 17న నిజాం పాలన నుంచి తెలంగాణ విముక్తి పొందిన చారిత్రక ఘట్టాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ స్వేచ్ఛను కాపాడుకోవడం, తెలంగాణ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన బాధ్యత ఉందని వారు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనగామలో ..



**వరంగల్ వాయిస్, జనగామ :** స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంఛార్జి కలెక్టర్ పింకేష్ కుమార్, అదనపు కలెక్టర్ బెన్షలోమ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆయనకు పూలబొకే ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు ఇచ్చిన గౌరవ వందనాన్ని బీర్ల అయిలయ్య స్వీకరించారు. తర్వాత జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథితో పాటు ఇంఛార్జి కలెక్టర్, అదనపు కలెక్టర్, డీసీపీ, జడ్పీ సీఈఓ మాధురి షా, ఆర్‌డీఓ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య జిల్లాలో వివిధ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణకు జరిగింది విద్రోహమే



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** తెలంగాణకు జరిగింది విముక్తి కాదని, అది భారత సైన్యాల ఆక్రమణ అని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్ అన్నారు. ఖిలా వరంగల్, విద్యానగర్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దయాకర్ మాట్లాడుతూ నిజాం నవాబు, రజాకార్లు, భూస్వాముల దోపిడీలకు వ్యతిరేకంగా నాటి కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని చేసిందని చెప్పారు. ఈ పోరాటం కారణంగా ప్రజలు లక్షలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అయితే, తెలంగాణ సంస్థానంలో కమ్యూనిస్టు పార్టీ ఆధిపత్యం పెరిగితే, అది స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకునే ప్రమాదం ఉందని నెహ్రూ భయపడ్డారని, అందువల్ల నిజాం నవాబుతో కలిసి వందలాది కమ్యూనిస్టు నాయకులను, కార్యకర్తలను హత్య చేశారని ఆరోపించారు. 'ఆపరేషన్ పోలో' పేరుతో జరిగిన ఈ హత్యాకాండకు నాటి హోంమంత్రి వల్లభాయ్ పటేల్ నాయకత్వం వహించారని విమర్శించారు. ప్రస్తుతం మోడీ ప్రభుత్వం, బీజేపీ నాయకులు ఈ పోరాటాన్ని ముస్లిం రాజులకు, హిందూ ప్రజలకు మధ్య జరిగిన ఘర్షణగా చిత్రీకరించి, 'విమోచన దినం'గా చెబుతున్నారని దయాకర్ అన్నారు. ఇది భవిష్యత్తులో మైనారిటీ ప్రజలపై దాడులకు దారితీస్తుందని హెచ్చరించారు. దేశంలో పెరుగుతున్న హిందూ ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా విశాల ప్రజా ఉద్యమం మాత్రమే ప్రత్యామ్నాయమని ఆయన అన్నారు. ఈ సదస్సుకు న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షత వహించగా, జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, ఐఎఫ్‌టీ నాయకులు మహమ్మద్ ఖాన్, గద్దల ప్రభాకర్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా మోడీ జన్మదిన వేడుకలు

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలో బుధవారం తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు చీమల బిక్షపతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చీమల భిక్షపతి మాట్లాడుతూ సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండా ఎగురవేస్తున్నామన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతో భారత సైన్యం 'ఆపరేషన్ పోలో' నిర్వహించి, నిజాం, రజాకార్ల పాలన నుంచి తెలంగాణను విముక్తి చేసి, భారత యూనియన్‌లో విలీనం చేసిందని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షులు పట్టపురం ఏకాంతం గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ విమోచన కోసం రైతులు, మహిళలు, వివిధ సంస్థలు చేసిన పోరాటాలు మరువలేనివి అన్నారు. నిజాం, రజాకార్లు ప్రజలపై చేసిన దారుణాలు చరిత్రలో మరెక్కడా లేవని తెలిపారు. 77 సంవత్సరాలు పూర్తయినా, అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరపకపోవడం ప్రజల త్యాగాలను



విస్మరించడమే అవుతుందన్నారు. గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వం కానీ, ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కానీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఒక మతానికి మద్దతు ఇస్తూ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం తప్పకుండా అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా మండల అధ్యక్షులు గొల్లపెల్లి సంతోష్ కుమార్, వివిధ మోర్చాల అధ్యక్షులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## చింత నెక్కొండలో..



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని చింతనెక్కొండ గ్రామంలో నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు, తెలంగాణ విమోచన దినోత్సవం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలంగాణ విముక్తి కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పిచ్చిరెడ్డి, మాజీ ఎంపీటీసీ కుడికాల శ్రీధర్, మండల ప్రధాన కార్యదర్శి బత్తిని దేవేందర్, మండల నాయకులు ఎడెల్లి సుధాకర్, పిల్లల రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో ..



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బీజేపీ మండల అధ్యక్షులు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి ఈ వేడుకలను నిర్వహించారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, నిజాం రజాకార్ల దురాగతాల నుంచి సర్దార్ వల్లభభాయ్ పటేల్ 'ఆపరేషన్ పోలో' ద్వారా తెలంగాణను విముక్తి చేసి, 1948 సెప్టెంబర్ 17న భారత యూనియన్‌లో విలీనం చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ పోరాటంలో అమరులైన వేలాది మంది తెలంగాణ వీరులకు నివాళులర్పించారు. కేంద్ర ప్రభుత్వం బుధవారం అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ, రాష్ట్రంలో గత ప్రభుత్వం 'సమైక్యత దినోత్సవం'గా, ప్రస్తుత ప్రభుత్వం 'ప్రజా పాలన దినోత్సవం'గా జరుపుతున్నాయని విమర్శించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించి, చరిత్రను భావితరాలకు తెలియజేయాలని బీజేపీ తరపున డిమాండ్ చేశారు. అనంతరం మోదీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కౌన్సిల్ సభ్యులు గట్టు వేణు, ఆర్టీఐ జిల్లా కన్వీనర్ ఏదులాపురం శ్రవణ్ కుమార్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు సముద్రాల రవి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దామెరలో ..



**వరంగల్ వాయిస్, దామెర :** భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దామెర మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. మండల బీజేపీ అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయచందర్ రెడ్డి కేక్ కట్ చేసి, పండ్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ పురోగతికి, 'వికసిత్ భారత్' నిర్మాణానికి మోదీ నాయకత్వం ఎంతో అవసరమని అన్నారు. 'సబ్కా సాథ్, సబ్కా వికాస్' స్ఫూర్తితో మోదీ పాలన అన్ని వర్గాల ప్రజలకు చేరువైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గురిజాల శ్రీరామ్ రెడ్డి, ముత్యాల శ్రీనివాస్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పావుడాల మధుకర్, మాదారపు రతన్ కుమార్, సేవా పక్వాడ మండల కన్వీనర్ గన్ను సతీష్, కో కన్వీనర్లు పెంట రమేష్, గడ్డం కార్తీక్, మండల ప్రధాన కార్యదర్శి సూర చందర్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల రమేష్, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల సుధాకర్, బీజేవైఎం జిల్లా నాయకులు కట్టగాని శ్రీకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 36వ డివిజన్ లో పండ్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత ప్రధాని నరేంద్ర మోదీ 75వ పుట్టినరోజు సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం 36వ డివిజన్‌లోని చింతల్ ప్రాంతంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ వరంగల్ అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, ప్రజలకు పంపిణీ చేశారు. అదేవిధంగా, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యకర్తలు మానుపాటి ఎల్లయ్య, ముదిగొండ పాపయ్య, రజియా సుల్తానా, స్థానిక ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

## కరీమాబాద్‌లో ..



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** భారత ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదిన వేడుకలను కరీమాబాద్‌లోని చెట్ల వారి గడ్డ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, ప్రజలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల దీన్ దయాల్, మండల అధ్యక్షులు బోరిగం నాగరాజ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బైరి నాగరాజు, డివిజన్ అధ్యక్షుడు ఆకుతోట రాజుతో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ సీనియర్ నాయకులు కోల రాజు బీజేపీలో చేరారు. కుసుమ సతీష్ బాబు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. తన మాతృసంస్థకు తిరిగి రావడం ఆనందంగా ఉందని కోల రాజు ఈ సందర్భంగా తెలిపారు.

## కామారెడ్డిపల్లిలో ..



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని కామారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు, తెలంగాణ విమోచన దినోత్సవం ఘనంగా జరిగాయి. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, యువత సాధికారత కోసం బీజేపీ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రజా పాలన దినోత్సవ వేడుకలు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండలంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వం ఈ దినోత్సవాన్ని గత మూడేళ్లుగా అధికారికంగా నిర్వహిస్తోందని తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఆత్మకూరు గ్రామపంచాయతీలో గ్రామ కార్యదర్శి శ్వేత ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో గ్రామ ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ స్టేషన్‌లో సీఐ సంతోష్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మండలంలోని పెంచికలపేట ప్రాథమిక వ్యవసాయ పరస్పర సహకార కేంద్రంలో చైర్మన్ కంది శ్రీనివాసరెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి, వృద్ధులు, పిల్లలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ భాస్కర మూర్తి, ఏపీవో రాజిరెడ్డి, ఆత్మకూరు మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు, రేవురి జయపాల్ రెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మామునూరు బెటాలియన్‌లో..



**వరంగల్ వాయిస్, మామునూరు :** మామునూరులోని నాలుగవ బెటాలియన్ ఆవరణలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి, జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, హైదరాబాద్ సంస్థానానికి మాత్రం రాలేదని గుర్తు చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చేపట్టిన 'ఆపరేషన్ పోలో' ద్వారా నిజాం నిరంకుశ పాలన అంతమై, 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం భారత యూనియన్‌లో విలీనమైందని తెలిపారు. ఈ రోజును ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు శ్రీనివాస రావు, వీరన్న, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రాజు, విజయ్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, బెటాలియన్ సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కౌశిక్ రెడ్డికి మానసిక స్థితి బాగోలేదు: ప్రణవ్




**వరంగల్ వాయిస్, హుజూరాబాద్ :** హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్, బీఆర్ఎస్ నాయకుడు కౌశిక్ రెడ్డికి 'సీజోఫెర్నియా' అనే మానసిక జబ్బు ఉందని, వెంటనే ఆసుపత్రిలో చేర్పించాలని వారి కుటుంబ సభ్యులను కోరారు. బుధవారం హుజూరాబాద్ కాంగ్రెస్ కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకల అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రణవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడం మానుకోవాలని కౌశిక్ రెడ్డికి హితవు పలికారు. "రాష్ట్ర ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని కలుస్తారని స్వయంగా చెప్పినప్పటికీ, కౌశిక్ రెడ్డి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు. దమ్ముంటే అందుకు ఆధారాలు చూపించాలి" అని సవాల్ విసిరారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎందుకు ఓటు వేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. ఒక తెలుగువాడిగా ఉపరాష్ట్రపతి ఎన్నికలకు దూరంగా ఉండటం బీఆర్ఎస్ అక్కసుకు నిదర్శనమని అన్నారు. అంతేకాకుండా, "రెండు సంవత్సరాలు ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు కౌశిక్ రెడ్డి ఒక్క కమిటీ కూడా వేయకుండా కార్యకర్తలను ఇబ్బంది పెట్టారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం గురించి మాట్లాడటం సిగ్గు చేటు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ, ఆలయ, పార్టీ కమిటీలను నియమించాం. ఇది మాకు, అతనికి ఉన్న తేడా" అని ప్రణవ్ వివరించారు. ఉద్యమ పార్టీగా మొదలైన బీఆర్ఎస్ ఇప్పుడు దేశంలోనే అత్యంత ధనవంతుడైన ప్రాంతీయ పార్టీగా ఎలా మారిందో చెప్పాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్‌గా తెలంగాణను దోచుకొని, బీఆర్ఎస్‌గా దేశాన్ని దోచుకోవాలని చూస్తే ప్రజలు ఇంటికి పంపారని విమర్శించారు. బీఆర్ఎస్‌ను ఇకపై 'బోగస్ రాష్ట్ర సమితి'గా పిలవాలని సూచించారు. కౌశిక్ రెడ్డి 'వన్ టైమ్ ఎమ్మెల్యే' అని, హుజూరాబాద్ భవిష్యత్తు కాంగ్రెస్ పార్టీదేనని ప్రణవ్ స్పష్టం చేశారు.

# ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని గ్రేటర్ వరంగల్ పరిధిలో ఉన్న 02వ డివిజన్ రెడ్డిపురం, విజయలక్ష్మి కాలనీలో శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోచమ్మ దేవాలయం వద్ద బుధవారం విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్‌కు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. విజయలక్ష్మి కాలనీ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సొసైటీ సభ్యులు శృంగారం భాస్కర్ ఆచారి, రుద్రోజు సదానందం, ప్రవీణ్ గాయత్రి, కల్వచర్ల నరేందర్, పోతుగంటి రమేష్, సిద్ధోజు రమేష్, సిద్ధోజు రాకేష్, సిద్ధోజు రాము, ఎలేశ్వరి మొగిలి, పోలోజు రమేష్, పోలోజు చంద్రచారి, కందారపు రాజు, అపోజు రాజు, పోతుగంటి బాబురావు, చిన్నోజు గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

## సీఐ చంద్రమౌళి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని డోర్నకల్ సీఐ చంద్రమౌళి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జైన్ సమావేశ క్షేత్రంలో జైన్ మహిళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ఎస్సైలు గడ్డం ఉమా, ఖాదర్ పాషాలతో కలిసి సందర్శించి, రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజూ రక్తం అవసరమై తలసేమియా రోగులు, గర్భిణులు, ప్రమాదాల్లో గాయపడినవారు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలను కాపాడగలమని చెప్పారు. ప్రతి రక్తపు బొట్టు విలువైనదని, దేనినైనా పునరుత్పత్తి చేయవచ్చు కానీ రక్తాన్ని మాత్రం దానం చేయడం వల్లే పొందవచ్చని అన్నారు. ఈ సందర్భంగా రక్త సేకరణ శిబిరాన్ని ఏర్పాటు చేసిన జైన్ మహిళా పరిషత్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షురాలు సుశీల జైన్ పాట్నీ, కార్యదర్శి కాలా భారతి జైన్, కోశాధికారి కాలా వినీత జైన్, ప్రియాంక, మౌనిక, ఆశ, రేఖ, షర్మిళ తదితరులు పాల్గొన్నారు.

# సిగ్గులేని బీఆర్ఎస్ నేతలు

## ◆ గులాబీ పార్టీ నాయకుల తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మండిపాటు




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకుల తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కే.ఆర్. నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు "మనది ఒక రకం, మీది ఒక రకం" అని మాట్లాడుతున్నారని, ఇది సరికాదని అన్నారు. ప్రతిపక్షంలో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన పెద్దమనిషి కనిపించడం లేదని విమర్శించారు. అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనే ఆకాంక్షతోనే ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని, గతంలో బీఆర్ఎస్‌లో విలీనమైన ఎమ్మెల్యేల గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. "బిస్కెట్లు వేస్తే స్థాయిని మరచి మాట్లాడటం సిగ్గుచేటు" అని నాయిని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు ఇప్పటికీ సమాధానం చెప్పలేదని, ప్రజల దృష్టి మరల్చడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి కృషి చేస్తుంటే, బీఆర్ఎస్ నాయకులు తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. తమ హయాంలో నిర్మించిన ఏళ్లనాటి ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కుచెదరలేదని, అవినీతికి తావు లేకుండా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. కడియం శ్రీహరిపై చేసిన విమర్శలను ఖండిస్తూ, బీఆర్ఎస్ నాయకులకు కడియంను విమర్శించే హక్కు లేదని నాయిని అన్నారు. గతంలో టికెట్ విషయంలో రాజయ్యను పక్కనపెట్టి కడియంకు ఎందుకు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. రాజయ్యకు టికెట్ ఇవ్వనప్పుడు మాట్లాడని వారు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కడియం తన నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేశారని, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని నాయిని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీసీసీ అధ్యక్షుడికి ఘన సత్కారం



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సి రాజేందర్ రెడ్డిలు తమ నివాసానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, పీసీసీ చీఫ్‌గా మహేష్ కుమార్ గౌడ్ ఏడాది కాలంలో పార్టీ బలోపేతానికి చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. అన్ని వర్గాల నాయకులను సమన్వయం చేస్తూ, పార్టీని గెలుపు దిశగా నడిపిస్తున్న ఆయన నాయకత్వం ప్రతి కార్యకర్తలో విశ్వాసం నింపిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో ఆయన పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షల కోసం పోరాడుతూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న మహేష్ గౌడ్ తపన అందరికీ ఆదర్శప్రాయమని తెలిపారు. అనంతరం, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత పార్టీకి కొత్త ఉత్సాహం వచ్చిందని, కార్యకర్తల్లో జోష్ పెరిగిందని అన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు అందరినీ సమానంగా చూసుకుంటూ ముందుకు నడిపిస్తున్న తీరు ప్రశంసనీయమని చెప్పారు. ముఖ్యంగా కింది స్థాయి కార్యకర్తలకు గౌరవం ఇస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయడం విశేషమని పేర్కొన్నారు. ఆయన నాయకత్వం వల్ల తెలంగాణ కాంగ్రెస్ మరింత బలపడుతుందని నమ్మకం వ్యక్తం చేశారు.

# త్వరలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలో త్వరలోనే అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేయబోతున్నామని హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. బుధవారం ఆయన కమలాపూర్ మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల మరమ్మతుల కోసం సంబంధిత మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి పూర్తి వివరాలు అందజేయడం జరిగిందని, ఆ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని అన్నారు. కమలాపూర్‌లో 320, గూడూరులో 50, మర్రిపల్లిగూడెంలో 50 ఇళ్లను అర్హులైన పేదలకు అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందజేస్తామని ప్రణవ్ హామీ ఇచ్చారు. కమలాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# 19న మండల స్థాయి క్రీడా పోటీలు



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని వరికోల్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 19న మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కె. హనుమంతరావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో మండలంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల బాల, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీలకు మండల కన్వీనర్‌గా హనుమంతరావు, సెక్రటరీగా సుభాష్ కుమార్ వ్యవహరిస్తారని, ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

# వైభవంగా విశ్వకర్మ జయంతి



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని పలు గ్రామాల్లో శ్రీ విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నడికూడ మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కడివెండి నరేందర్ చారి ఆధ్వర్యంలో ఈ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా విశ్వకర్మ భగవానుడి చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వకర్మ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడు బెజ్జంకి వెంకటయ్య చారి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎలకంటి రాజు చారితో పాటు కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కుడ్ల మల్హల్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు బెజ్జంకి రాజేందర్ చారి, ప్రధాన కార్యదర్శి బండ్ల రాజు చారి, కోశాధికారి కడివెండి ప్రశాంత్ చారి, సహాయ కార్యదర్శి బండ్లోజు రమేష్ చారి, కార్యవర్గ సభ్యులు బెజ్జంకి మహేందర్ చారి, కడివెండి కృష్ణమూర్తి, సత్యం చారి, వెంకటేష్ చారి, రాజు చారి తదితర విశ్వబ్రాహ్మణ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోట్ బుక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** తమ కుమారుడు జాటోత్ చైతన్య నాయక్ రెండవ వర్ధంతి సందర్భంగా పర్వతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్, ఆయన సతీమణి సుమిత్రలు బుధవారం గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్కులు, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దంపతులు తమ కుమారుడి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ఆ విద్యార్థులలో తమ కుమారుడి స్వరూపాన్ని చూసుకున్నామని తెలిపారు. తమ కుమారుడి జ్ఞాపకాలను మరువకుండా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జమాల్‌పురంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో సుమారు 100 మంది విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది సమక్షంలో ఈ సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ అధ్యక్షులు భాను భాస్కర్ నాయక్, జున్ను కనకయ్య, శ్రీనివాస్, ఎల్లా గౌడ్, మాజీ ఎంపీటీసీ మహమ్మద్ అలీ, కొమ్ము రమేష్, ఎస్. కె. అక్బర్ పాషా, లచ్చు నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని చారిత్రక శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల 22 (సోమవారం) నుంచి అక్టోబర్ 4 (శనివారం) వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖను ఆలయ వేద పండితులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని ఆహ్వానించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు అవసరమైన ఏర్పాట్లు ప్రభుత్వ పరంగా చేయాలని పండితులు మంత్రిని కోరారు. ఇందుకు మంత్రి కొండా సురేఖ సానుకూలంగా స్పందిస్తూ, ఈ నెల 26న శుక్రవారం ఆలయాన్ని సందర్శిస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో ఉత్సవ కమిటీ సభ్యులు నీలారపు రాజ్ కుమార్, మల్లా ప్రగడ పవన్ శర్మ ఉన్నారు. సద్దుల బతుకమ్మ ఉత్సవాలను కూడా ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

# రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్లో రాణించాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో రాణించాలని హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారిణి (డీఈఓ) డి.వాసంతి అన్నారు. బెంగుళూరులోని విశ్వేశ్వరయ్య వైజ్ఞానిక, సాంకేతిక సంగ్రహాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సైన్స్ సెమినార్‌కు సంబంధించిన జిల్లా స్థాయి పోటీలు హనుమకొండలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగాయి. 'క్వాంటం ఏజ్ బిగిన్స్: పొటెన్షియల్స్ అండ్ చాలెంజెస్' అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించారు. జిల్లా సైన్స్ అధికారి ఎస్. శ్రీనివాస స్వామి పర్యవేక్షణలో జరిగిన ఈ సెమినార్‌లో ధర్మసాగర్ మండలం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని అపూర్వ శ్రీవాత్సవ ప్రథమ స్థానంలో నిలిచింది. డీఈఓ వాసంతి ఆమెను అభినందిస్తూ, మరింత మెలకువతో రాష్ట్రస్థాయి సెమినార్‌లో పాల్గొని జాతీయస్థాయికి ఎంపిక కావాలని ప్రోత్సహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 18 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పెంబర్తిలోని ఏకశిలా టెక్నో స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని ఎం. మన్వితారెడ్డి ద్వితీయ స్థానం, అయినవోలులోని ఏకశిలా సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని వై.రేష్మ తృతీయ స్థానం సాధించారు. కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వాగ్దేవి డిగ్రీ కళాశాలల నుంచి వచ్చిన అధ్యాపకులు శ్రవణకుమారి, బి.స్వప్న న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి, విజేతలను అభినందించారు. ఈ పోటీల నిర్వహణ కమిటీలో ఉపాధ్యాయులు ఎ.సంపతి, బి.శ్వేత, కె.రమాదేవి పాల్గొన్నారు. ప్రథమ స్థానం పొందిన విద్యార్థిని అపూర్వ శ్రీవాత్సవ రేపు హైదరాబాదులోని రాష్ట్ర విద్య పరిశోధన మండలిలో జరిగే రాష్ట్రస్థాయి సెమినార్‌లో పాల్గొననున్నారు.

# డ్రగ్స్ అంతానికి సమిష్టి కృషి అవసరం



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఉందని కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు, నార్కోటిక్స్ డిపార్ట్‌మెంట్ యాంటీ డ్రగ్ కమిటీ మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. బుధవారం హసన్‌పర్తిలోని కిట్స్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ రెడ్డి అధ్యక్షతన జరిగిన యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ వాడినా, విక్రయించినా నేరమని, దానికి శిక్షార్హులవుతారని విద్యార్థులను హెచ్చరించారు. విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని, డ్రగ్స్ విక్రయదారులు విద్యార్థులను పావులుగా వాడుకుంటున్నారని, అందువల్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కిట్స్ కాలేజీ డ్రగ్స్ రహిత క్యాంపస్‌గా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. కేయూ పోలీస్ స్టేషన్ సీఐ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తెలియని వారితో స్నేహం చేయవద్దని సూచించారు. అనంతరం, విద్యార్థులతో డ్రగ్స్ వాడమని, డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నార్కోటిక్స్ డిపార్ట్‌మెంట్ యాంటీ డ్రగ్ పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, సీఐ రవికుమార్, ప్రిన్సిపాల్ అశోక్ రెడ్డి, నాగార్జున రెడ్డి, ఆచార్య రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రామ రాజేష్ ఖన్నాకు సన్మానం



**వరంగల్ వాయిస్, పెద్దపల్లి :** జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నాను పెద్దపల్లి జిల్లా ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. బుధవారం పెద్దపల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యోగి బుచ్చిబాబు.. ఖన్నాకు పూల బొకే, శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 1195, 1187 జీఓల సమస్యను పరిష్కరించడంలో రామ రాజేష్ ఖన్నా కీలక పాత్ర పోషించారని అన్నారు. ధర్నాలు, వినతిపత్రాల ద్వారా అధికారులను ఒప్పించి, దాదాపు 3 వేల మంది ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారని ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 19 నెలల్లోనే ఈ జీఓ సాధనలో ఖన్నా కృషి అభినందనీయమని చెప్పారు. సత్కారం అనంతరం రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ, జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# శరన్నవరాత్రి ఉత్సవాలకు మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దసరా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించాలని కోరుతూ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావును టీపీసీసీ కార్యదర్శి, కనకదుర్గ దేవాలయ కమిటీ అధ్యక్షులు మీసాల ప్రకాష్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ, కొండా మురళీధర్ రావు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# స్థాయి మరిచి విమర్శిస్తే సహించం



**వరంగల్ వాయిస్, రేగొండ :** ఇతరులను విమర్శించేటప్పుడు స్థాయిని మరిచి మాట్లాడటం సరికాదని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు. అభివృద్ధిపై తాము అడిగే ప్రశ్నలకు కాంగ్రెస్ నాయకులు దమ్ముంటే సమాధానం చెప్పాలని రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా అధ్యక్షులు హింగే మహేందర్ సవాల్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. హింగే మహేందర్ మాట్లాడుతూ చెంచుపల్లి గ్రామానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి కోటి 66 లక్షల రూపాయల ఎస్టీ ఎస్‌డీఎఫ్ నిధులు తీసుకొస్తే, ఇప్పుడున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు మళ్లీ శంకుస్థాపన చేశారని ఆరోపించారు. ఒకే పనికి రెండుసార్లు శంకుస్థాపన చేయడం విడ్డూరమని, ఈ విషయంపై బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రశ్నిస్తే, రమణారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా కేంద్రంలో ఆసుపత్రి, మెడికల్ కాలేజీ, కోటంచ గుడి కోసం నాలుగు ఎకరాల కొనుగోలు, ఫంక్షన్ హాల్, ఐదు గెస్ట్ హౌస్‌ల నిర్మాణం రమణారెడ్డి హయాంలోనే జరిగాయని ఆయన గుర్తు చేశారు. రమణారెడ్డిని విమర్శిస్తేనే కాంగ్రెస్ నాయకులకు పదవులు దక్కుతాయనే అత్యుత్సాహంతో మాట్లాడుతున్నారని విమర్శించారు.




# మోడీ జీవితంపై బయోపిక్

## నటుడు ఉన్ని ముకుందన్ పోస్ట్

మలయాళం సినీ నటుడు ఉన్ని ముకుందన్.. ప్రధాని మోదీ పాత్రను పోషించనున్నారు. మోదీపై తీస్తున్న బయోపిక్‌లో అతను మోడీ రోల్ ప్లే చేయనున్నారు. అన్ని భారతీయ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. ఈ ఫిల్మ్‌కు మా వందే అని టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ పేజీల్లో పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ప్రఖ్యాత ఫిల్మ్‌మేకర్ క్రాంతి కుమార్ సీహెచ్ ఈ సినిమాను డైరెక్ట్ చేయనున్నారు. ప్రధాని మోదీ పాత్రలో నటించనున్నానని, ఈ విషయాన్ని పంచుకునేందుకు సంతోషిస్తున్నానని, మా వందే –టైటిల్‌తో ఆ ఫిల్మ్ రిలీజ్ కానున్నదని నటుడు ఉన్ని ముకుందన్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. బుధవారం ప్రధాని మోదీ 75వ జన్మదినోత్సవం సంద్భంగా ఈ ప్రాజెక్టును ప్రకటించారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదని ఆ ఫిల్మ్‌కు ట్యాగ్‌లైన్ ఇచ్చారు. అహ్మద్‌బాద్‌లోనే పెరిగానని, తన చిన్నతనంలో మోదీని సీఎంగా చూశానని, ఆ తర్వాత 2023 ఏప్రిల్‌లో ఆయన్ను వ్యక్తిగతంగా కలుసుకున్నానని, ఆ సమయంలో మోదీపై తనకు ప్రత్యేక అభిమానం కలిగినట్లు– ముకుందన్ తెలిపారు. ఓ నటుడిగా ప్రధాని మోదీ పాత్రను పోషించడం పట్ల సంతోషంగా ఫీలవుతున్నానని, ఇది చాలా ఇన్‌స్పైరింగ్‌గా ఉందన్నారు. ప్రధాని మోదీ రాజకీయ జీవితం అసాధారణంగా సాగిందని, అయితే తాము తీయబోయే సినిమాలో మోదీని మరో కోణంలో చూపిస్తామని, తన మాతృమూర్తితో ఉన్న అనుబంధాన్ని ఆ ఫిల్మ్‌లో ఎక్కువగా ఫోకస్ చేయనున్నట్లు– నటుడు ఉన్ని ముకుందన్ తెలిపారు. ఎవరి ముందు తలవంచవద్దు అని గుజరాతీలో మోదీ చెప్పేవారని ఆయన గుర్తు చేశారు. ప్రధాన భాషల్లో మా వందే సినిమాను తీస్తామని, ఆ తర్వాత దాన్ని ప్రపంచవ్యాప్తంగా రిలీజ్‌చేయనున్నట్లు– ఆయన చెప్పారు. మోదీ బర్త్‌డే సందర్భంగా ఆయనకు విషెస్ తెలిపారు.

# బర్ఫీ మూవీ సెట్‌లో

## దర్శకుడి తీరు బాధించింది

ఆనాటి అనుభవం పంచుకున్న నటి ఇలియానా టాలీవుడ్‌లో ఒక్కప్పుడు టాప్ హీరోయిన్లలో ఒకరిగా నిలిచిన గోవా బ్యూటీ– ఇలియానా, తెలుగు సినిమాలకు దూరంగా ఉండి చాలా కాలం అవుతుంది. అనంతరం కోలీవుడ్, బాలీవుడ్‌లలో కొన్ని చిత్రాలు చేసిన ఆమె, తన విదేశీ ప్రియుడిని వివాహం చేసుకుని ఇద్దరు పిల్లల తల్లిగా కొత్త జీవితం ప్రారంభించింది. ఇటీవల జరిగిన ఇంటర్వ్యూలో ఆమె వ్యక్తిగతం, వృత్తిగతం ఇలా అనేక విషయాలను పంచుకుంది. అందులో ముఖ్యమైన అంశం ఆమె తొలి హిందీ చిత్రం బర్ఫీ సమయంలో ఎదుర్కొన్న చేదు అనుభవం. ఇలియానా మాట్లాడుతూ.. ' 'బర్ఫీ' మూవీ సెట్‌లో దర్శకుడు అనురాగ్ బసుతో నాకు ఒకసారి ఘర్షణ ఎదురైంది. ఆ రోజు చాలా హ్యాపీగా సెట్‌కి వెళ్లాను. కానీ అప్పటికే బసు సర్ మానసికంగా బాగోలేరు, ఏదో టెన్షన్‌లో ఉన్నారు. నేను వెళ్ళగానే నాపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. దాంతో నేను షాక్ అయ్యాను. నిజంగా చాలా బాధపడ్డాను. ఆ సమయంలో 'దాదా.. వినండి.. నేను ఈ పాత్రకు సరైన దానిని కాదని మీరు అనుకుంటే.. నా వర్క్ విషయంలో మీరు సంతోషంగా లేకుంటే నేను వెళ్ళిపోతాను. నేను మీ పై దావా వేయబోవడం లేదు. నేను వెళ్తున్నానని చెప్పాను. ఒక దశలో ఏడుస్తూ నిర్మాతకు కాల్ చేయాలనిపించిన సందర్భం కూడా ఉన్నాయి. కానీ తర్వాత పరిస్థితులను అర్థం చేసుకుని, అనురాగ్ బసుతో ఎలాగోలా అడ్జస్ట్ అయి సినిమా పూర్తి చేశా. చివరికి బర్ఫీ చిత్రానికి జాతీయ అవార్డు రావడం నాకు ఎంతో గర్వంగా అనిపించింది' అని ఇలియానా పేర్కొంది. క్రియేటివ్ రంగంలో ఎవరికైనా ఏమి నచ్చుతుందో, ఏమి నచ్చదో చెప్పలేం. కానీ ఆ అనుభవం నాకు బలాన్ని ఇచ్చింది అని కాన్ఫిడెంట్‌గా వెల్లడిరచింది.



# శ్రియా వల్లనే కలసి వచ్చిందన్న తేజసజ్జా



వందకోట్ల క్లబ్‌లో చేరిన మిరాయ్ మూవీ

యంగ్ హీరో తేజ సజ్జా నటి శ్రియా శరణ్‌పై ప్రశంసలు కురిపించారు. తనది ఈ సినిమాలో అమ్మ పాత్ర కాదు.. ఈ కథకు అమ్మ పాత్ర అని అన్నారు. ఆమె వల్లే ఈ సినిమాకు లక్ కలిసొచ్చిందన్నారు. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో ఆయన హీరోగా నటించిన చిత్రం 'మిరాయ్'. రితికా నాయక్ కథానాయిక. మంచు మనోజ్ కీలక పాత్ర పోషించారు. ఇటీ–వల విడులైన ఈ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా విజయవాడ పున్నమి ఘాట్‌లో నిర్వహించిన విజయోత్సవాల్లో తేజ సజ్జా మాట్లాడారు.

తేజ సజ్జా, మనోజ్ ప్రధాన పాత్రల్లో నటించిన 'మిరాయ్' విజయాన్ని అందుకుంది. ఈ సినిమా సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాగా.. తొలిరోజు రూ.20 కోట్ల వసూళ్లు రాబట్టింది. ఐదు రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. తమ సినిమా రూ.100 కోట్లు–సాధించడంపై తేజ సజ్జా, మంచు మనోజ్ ఆనందం వ్యక్తం చేస్తూ పోస్ట్‌లు పెట్టారు. ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. తాజాగా ఈ సినిమా సక్సెస్ మీట్‌ను విజయవాడలో ఘనంగా నిర్వహించారు. ప్రేక్షకులంతా కుటుంబంతో కలిసి సినిమా చూడాలన్న ఉద్దేశంతోనే దీని టికెట్ ధరలు కూడా పెంచలేదని నిర్మాత తెలిపారు. ఈ విజయం తర్వాత తనలో మరింత బాధ్యత పెరిగినట్లు– తేజ చెప్పారు. ఈ సినిమా దర్శకుడు కార్తిక్ ఘట్టమనేని ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని సీక్వెల్‌లో నిధి అగర్వాల్ స్పెషల్ సాంగ్ ఉంటు–ందని తెలిపారు. నిధితో ఓ ప్రత్యేక పాట చిత్రీకరించామని.. మొదటి పార్ట్‌లో వాడలేకపోయామన్నారు.. సెకండ్ పార్ట్ కోసం కొన్ని ఐడియాలు సిద్ధంగా ఉన్నట్లు– చెప్పారు.






# లిటిల్ హార్ట్‌కు మహేశ్ బాబు ఫిదా



సింజిత్...ఫోన్ ఆఫ్ చేయొద్దంటూ..పోస్ట్

చిన్న సినిమాగా విడుదలై సూపర్ హిట్ విజయాన్ని అందుకుంది లిటిల్ హార్ట్స్ ఇప్పటికే ఈ సినిమాపై ప్రశంసలు కురిపిస్తూ సినీ ప్రముఖులు పోస్ట్‌లు పెట్టారు. తాజాగా టాలీవుడ్ అగ్ర కథానాయకుడు మహేశ్ బాబు ఈ నవ్వుల రైడ్‌కు ఫిదా అయ్యారు. చిత్రబృందాన్ని అభినందిస్తూ.. ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. సంగీత దర్శకుడు సింజిత్‌ను ఉద్దేశిస్తూ ఫన్నీ కామెంట్ చేశారు. లిటిల్ హార్ట్స్.. ఆద్యంతం సరదాగా సాగే వినోదభరితమైన సినిమా. నటీనటు–లందరూ కొత్తవారే అయినా చాలా బాగా నటించారు. అద్భుతమైన నవ్వుల రైడ్ ఈ చిత్రం. సింజిత్ నువ్వు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఎక్కడికీ వెళ్లొద్దు బ్రదర్.. ఎందుకంటే నువ్వు కొన్నిరోజుల్లో చాలా బిజీగా మారిపోతావ్ అని అన్నారు. దీంతో పాటు చిత్రబృందానికి ఆయన అభినందనలు తెలిపారు. ప్రస్తుతం మహేశ్ పోస్ట్ వైరల్ అవుతోంది. మహేశ్ ప్రత్యేకించి సంగీత దర్శకుడిని అలా అనడానికి కారణముంది. ఇటీవల సింజిత్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాను మహేశ్‌కు వీరాభిమానినని చెప్పారు. మహేశ్ 'లిటిల్ హార్ట్స్' గురించి పోస్ట్ పెడితే తన ఆనందానికి హద్దులు ఉండవన్నారు. ఆ ఆనందంలో ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని వారం రోజులు ఎటైనా వెళ్లిపోతానన్నారు. అందుకే మహేశ్ తన పోస్ట్‌లో ప్రత్యేకంగా సింజిత్‌ను ఉద్దేశించి మాట్లాడినట్లు– తెలుస్తోంది.



# వారిది ప్రజాకంఠక పాలన

**420 హామీలు, 6 గ్యారెంటీల అమలు ఎప్పుడు**
**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. ప్రజాకంఠక పాలన అని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల 60 ఏండ్ల కలను సాకారం చేసేందుకు కేసీఆర్ 14 ఏండ్లు పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రాణాలకు తెగించి ప్రత్యేక తెలంగాణను సాధించారన్నారు. సాధించిన తెలంగాణను 10 ఏండ్లలో అన్ని రంగాల్లో దేశంలోనే నెంబర్ వన్ గా తీర్చిదిద్దారన్నారు. కాంగ్రెస్ నియంత, నియంతృత్వ పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. కేవలం 20నెలల్లోనే ప్రజా వ్యతిరేక విధానాలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు దూరమైందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారెంటీలను అటకెక్కించారని విమర్శించారు. యూరియా లేక అన్నదాతలు ఆగమవుతున్నారన్నారు. సమాజంలోని ఏ ఒక్క వర్గానికి న్యాయం చేయని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ఎలా అవుతుందని ప్రశ్నించారు. రాజకీయంగా మైనారిటీలను మోసం చేయడం ప్రజాపాలననా అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించకపోవడం, ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయి పేదలకు వైద్యం అందకపోవడం ప్రజా పాలన అవుతుందా అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, తండమల్ల వేణు, కుసుమ లక్ష్మీనారాయణ, నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, తెలంగాణ ఉద్యమకారులు, సీనియర్ నాయకులు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు నయీమొద్దీన్, సీనియర్ నాయకులు నరెడ్ల శ్రీధర్, గనిపాక విజయ్, బండి రజినీకుమార్, రవీందర్ రావు, సదాంత్, కనకరాజు, చందర్, దూలం వెంకన్న, సోని, మహమూద్, ఖలీల్, శ్రీనివాస్, విక్రమ్, మూటిక రాజు, సర్దార్, వేణు, చాగంటి రమేష్, గౌస్ ఖాన్, మహేందర్, కోటేశ్వర్, విజయ్ రెడ్డి, ఇస్మాయిల్, బచ్చు అనిల్ కుమార్, బైరపాక ప్రశాంత్, గండ్రకోట రాకేష్ యాదవ్, శ్రీకాంత్ చారి, స్నేహిత్, సందీప్, సంపత్ రెడ్డి, సారిక, దేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## త్యాగ స్ఫూర్తి సెప్టెంబర్ 17

మీ త్యాగం – మా శ్వాస,
మీ ఆత్మార్పణ –
నేటి మా గౌరవగీతం.
బాంచబతుకుల్లో వెలుగులు నింపిన
విశ్వాస తరంగమే... మీ ఆత్మార్పణ.
నిన్నటి కరిగిన రక్తజ్వాలలు
నేటి మా స్వేచ్ఛాబాణీలు.
మీరు నాటిన స్ఫూర్తి తంత్రం
ప్రతి పల్లెలో పూసే పూలదోట.
సెప్టెంబర్ పదిహేడు –
స్వేచ్ఛాకిరణమై
తెలంగాణ గుండెలను తాకిన వెలుగు.
మీ రుధిర జ్ఞాపకం
మా ఉదాత్త పతాకమై ఎగురుతోంది.
నాటి మీ గుండెల ధైర్యం,
కళ్లలో మెరిసిన జ్యోతి,
చేతుల్లో పొగిలిన త్యాగమే
మన మట్టిని మనదిగా మార్చింది.
నేటి స్వేచ్ఛాస్వరాజ్యం కోసం
ఆత్మార్పణ చేసిన వీరులారా...
మీకిదే మా వందనం.
మీరందించిన స్వాతంత్ర్య ధ్వజం
మా హృదయధ్వనిగా
అనునిత్యం అజరామరమై నిలుస్తుంది.



- లలిత (కోగిల చంద్రమౌళి)
పరకాల



# అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు నిర్వహించాలి

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కాశిబుగ్గలో దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఉత్సవ సమితి నిర్ణయించింది. ఈ మేరకు ఉత్సవ సమితి అధ్యక్షుడు ధూపం సంపత్ ఆధ్వర్యంలో ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. గత 37 సంవత్సరాలుగా దసరా, బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ సంవత్సరం కూడా చిన్న వడ్డేపల్లి చెరువు ప్రాంతంలో ఉత్సవాలను వైభవంగా జరపాలని సంపత్ తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్ల కోసం మంత్రి, కలెక్టర్, జిల్లా పోలీస్ యంత్రాంగం, మున్సిపల్ కమిషనర్‌లను కలిసి అవసరమైన సదుపాయాల గురించి చర్చించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గుల్లపల్లి రాజ్‌కుమార్, కన్వీనర్ బయ్య స్వామి, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్‌కుమార్, 19వ డివిజన్ కార్పొరేటర్ ఓనిస్వర్ణలత భాస్కర్, అలాగే ఇతర ఉత్సవ సమితి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# ఉద్యమ నేతకు ఘన సన్మానం



**తొలి ఉద్యమంలో జైలుపాలు**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం 1969 లో నిర్వహించిన తొలి ఉద్యమంలో పాల్గొని 15 రోజులు సెంట్రల్ జైలుకు వెళ్ళిన తెలంగాణ ఉద్యమకారుడు, పద్మశాలి పరపతి సంఘం కొత్తూరు కార్యవర్గ సభ్యుడు మాటేటి సూర్యనారాయణను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి బింగి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం 1969 లో పోరాడి జైలు కు వెళ్ళిన మాటేటి సూర్యనారాయణ మన పద్మశాలి బిడ్డ కావడం మన పద్మశాలి పరపతి సంఘం కొత్తూరు సభ్యులకే కాకుండా పద్మశాలీలందరికీ గర్వ కారణం అన్నారు. ఈ సందర్భంగా మన కమిటీ మెంబర్ మాటేటి సూర్యనారాయణ గారిని పద్మశాలి పరపతి సంఘం కొత్తూరు కమిటీ ఈరోజు సెప్టెంబర్ 17 సందర్భంగా కొత్తూరు పోచమ్మ ఆలయంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి పరపతి సంఘం అధ్యక్షుడు తౌటం విజేందర్, ప్రధానకార్యదర్శి బింగి శ్రీనివాస్, కోశాధికారి బింగి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు రామ వెంకటయ్య, సహాయ కార్యదర్శి బింగి సురేష్, కార్యవర్గ సభ్యుడు తౌటం అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్చరీ జట్ల ఎంపిక

**వరంగల్ వాయిస్, కేయూ :** యూనివర్సిటీ స్పోర్ట్ బోర్డు, కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్చరీ పురుషులు, మహిళల జట్లు సెలెక్షన్స్ నిర్వహించారు. ఇందులో వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ఆర్చరీ క్రీడాకారులు తన్వీర్ కౌసర్, త్రిశూల్, రమ్య శ్రీ, మనసుర హసీభ, వెంకటేష్, ఆనంద్, అశ్విత్ దొర, గంగ రాజు, సునీల్ పాల్గొన్నారు. ఈ జట్లు అక్టోబర్ లో జరుగు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్షిప్ లో పాల్గొంటారు. ఈ సెలెక్షన్స్ లో ప్రొఫెసర్ వెంకయ్య, సెక్రటరీ స్పోర్ట్ బోర్డు, సెలెక్టర్ లు డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్, డాక్టర్ కుమారస్వామి, రాజేష్, ఆంజనేయులు, పర్వీన్ క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## రేషన్ కు 'రేటు'

- కార్డుకు రూ.2000 డిమాండ్
- కలకలం రేపుతున్న డీలర్ వ్యవహారం

**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** వరంగల్ జిల్లా చెన్నారావు పేట మండలంలోని పాత ముగ్ధంపురం గ్రామంలో రేషన్ డీలర్ పై ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యం కోసం వెళ్లిన కొత్త కార్డు దారులను ఆయన వేధిస్తున్నారని, డబ్బులు డిమాండ్ చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మాదాసి దేవేంద్ర భర్త సాగర్ తన గోడును వెళ్లబోసుకుంటూ కొత్తగా కార్డు వచ్చిన సంతోషం లేకుండా చేస్తున్నాడని మండిపడ్డారు. బియ్యం కోసం వెళ్తే డీలర్ మనోహర్ రూ. 2,000 ఇస్తేనే బియ్యం ఇస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నడని ఆరోపించారు. ప్రశ్నిస్తే, 'నన్ను ఎవరూ ఏమీ చేయలేరు. ఎక్కడ చెప్పుకుంటావో చెప్పుకో' అంటూ దబాయిస్తున్నాడన్నారు. కేవలం డబ్బుల కోసమే కాకుండా, తూకంలోనూ మోసం చేస్తున్నారని, ప్రతి బస్తాలో రెండు నుంచి మూడు కిలోలు తక్కువ ఇస్తున్నారని ప్రజలు ఆరోపించారు. డీలర్ మోసపూరిత వైఖరిపై గ్రామ ప్రజలు స్థానిక ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశారు. వెంటనే డీలర్ ఆకుల మనోహర్‌పై విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉచితంగా అందించే బియ్యం విషయంలో కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారి పరిస్థితి డీలర్ చర్యలతో అగమ్య గోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com